సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 139 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | శనివారం 08-08-2026

## భయపడొద్దు, నేనున్నాను
# ప్రధాని మోదీ భరోసా



- టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా
- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

**ఢిల్లీ :**
ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన - మిగతా 2 లో

## పగలే రాత్రిగా మారే అద్భుతం




- యూరప్‌లో దశాబ్దాల తర్వాత ఖగోళ వింత
- 2026 ఆగస్టు 12న ఏర్పడనున్న సంపూర్ణ సూర్యగ్రహణం
- స్పెయిన్, ఐస్‌లాండ్‌లో పగలే రాత్రిగా మారనున్న వాతావరణం
- గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగనున్న సంపూర్ణ గ్రహణం
- గ్రహణ వీక్షణకు ప్రత్యేక కళ్లద్దాలు తప్పనిసరని శాస్త్రవేత్తల హెచ్చరిక

**ఢిల్లీ :**
ప్రపంచవ్యాప్తంగా ఖగోళ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంపూర్ణ సూర్యగ్రహణం 2026 ఆగస్టు 12న ఏర్పడనుంది. ఈ - మిగతా 2 లో

## ఒక దేశంపై దాడి జరిగితే
# మూడుదేశాలపై దాడి జరిగినట్టే

- పాక్, సౌదీ, టర్కీ మధ్య చారిత్రక ఒప్పందం
- సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్ మధ్య 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం'
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నడుమ కీలక పరిణామం
- మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాల మధ్య బలపడుతున్న సైనిక బంధం
- అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా ఈ ఒప్పందం



**ఢిల్లీ :**
పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. , పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు శుక్రవారం పవిత్ర మక్కా నగరంలో 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం'పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై సాయుధ దాడి జరిగినా, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. సామూహిక - మిగతా 2 లో

# రూ.500తో పాటు చిన్న నోట్లూ ఫేకే!

- నకిలీ నోట్లపై ఆర్బీఐ కీలక నివేదిక
- చిన్న నోట్లపై దృష్టి సారించిన దొంగనోట్ల ముఠాలు
- ఈ కుట్ర వెనుక దావూద్ సిండికేట్, పాక్ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు నిఘా వర్గాల అనుమానం
- రూ.20 నకిలీ నోట్లు 47.4 శాతం పెరిగాయని తెలిపిన ఆర్బీఐ
- మొత్తం నకిలీ నోట్ల గుర్తింపు 5.7 శాతం పెరిగినట్లు వెల్లడి
- అధికంగానే కొనసాగుతున్న రూ.500 నకిలీ నోట్ల దందా

**ఢిల్లీ :**
భారతదేశంలో నకిలీ కరెన్సీ చలామణిలో నేర ముఠాలు తమ వ్యూహాన్ని మార్చాయి. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేసే దావూద్ ఇబ్రహీం నెట్‌వర్క్‌తో సహా ఇతర సిండికేట్లు, ఇప్పటివరకు రూ.500 వంటి పెద్ద నోట్లను లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే, ఇప్పుడు తమ దృష్టిని రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన నోట్లపైకి మళ్లించాయని భారత భద్రతా సంస్థలు గుర్తించాయి. మార్కెట్లోకి ఈ చిన్న - మిగతా 2 లో



# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం
- చీరాలలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకున్నా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు విడుదల
- ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి




**అమరావతి :**
చేనేతలను ఆదుకునేందుకే నేతన్నల నేస్తం పథకాన్ని తెచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు సాయం అందిస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా కొత్తపేటలో 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకున్నా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సబ్సిడీపై చేనేత కార్మికులకు విద్యుత్ ఇస్తామన్న సీఎం, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ - మిగతా 2 లో

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?



- వైసీపీ అధినేత జగన్
- డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

**అమరావతి :**
డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు - మిగతా 2 లో



## నేత కార్మికులకు అండగా నిలుద్దాం

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- జాతీయ చేనేత దినోత్సవం
- నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

**అమరావతి :**
జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని నేత కార్మికులు, కళాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశపు గొప్ప నేత వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న నైపుణ్యం - మిగతా 2 లో



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్

**హైదరాబాద్ :**
జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ - మిగతా 2 లో

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు



- బీజేపీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు
- తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేసిన రామచందర్ రావు
- రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం
- మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు

**హైదరాబాద్ :**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ - మిగతా 2 లో

## వర్షాలు సమృద్ధిగా కురిసి
# రైతాంగం సుభిక్షంగా ఉండాలి

- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం
- వరుణయాగం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం
- ముహూర్తం ఖరారు చేసిన యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు
- దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువులు
- యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు
- పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణం వేదికగా ఈ యాగం చేయనున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఖరారు చేసిన ముహూర్తం ప్రకారం యాగ క్రతువులు నిర్వహించనున్నారు. 10న సాయంత్రం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్ మన్నె సత్య నారాయణ రెడ్డి (ఎంఎస్?ఎన్? రెడ్డి) తెలిపారు. కృష్ణ, గోదావరి నదులు, రిజర్వాయర్లు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడి పంటలు బాగా పండాలనే సంకల్పంతో సీఎం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆగస్టు 10న - మిగతా 2 లో

# సంపాదకీయం

## హసీనా సాహసం



ఆరునూరైనా ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్ వెళ్ళడం ఖాయమని ఆ దేశ మాజీ ప్రధాని షేక్‌హసీనా విస్పష్టంగా ప్రకటిం చారు. గతంలో కూడా ఇదేమాట అన్నప్ప టికీ, విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటన కనుక దీనికి కచ్చితంగా ఎంతో విలువ ఉంది. స్వదేశం వదిలివచ్చి రెండేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం ఢిల్లీలో ఆమె మీడియా సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. భారత్ పారిపోయివచ్చిన తరువాత, ఇక్కడనుంచి మీడియాను నేరుగా ఉద్దేశించి మాట్లాడటం ఇదే తొలిసారి. దీనిని జరగనివ్వకండని అనడం బాగుండదు కనుక, ఈ సమావేశంమీద భారత్ తన వైఖరిని స్పష్టంచేయాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేసింది. 'ఫారిన్ కరెస్పాండెట్స్ క్లబ్ (ఎఫ్‌సీసీ) ఆఫ్ సౌత్ ఏసియా' నిర్వహిస్తున్న ఈ సమావేశంలో తన ప్రమేయమేమీ లేదని, అది ఒక ప్రైవేటు వ్యవహారమని భారతదేశం తేల్చేసింది. అందులో ఆమె వ్యక్తపరచబోయే అభిప్రాయాలతో తనకు నిమిత్తం లేదని భారత్ స్పష్టంచేయడంతో బంగ్లాదేశ్ ప్రధాని నుంచి మంత్రులూ దిగువస్థాయి నాయకులవరకూ అంతా సత్సంబంధాలు దెబ్బతింటాయంటూ హెచ్చరికలు చేస్తున్నారు, నర్మగర్భంగా ఏవేవో మాట్లాడుతున్నారు. హసీనా వ్యాఖ్యలు, ప్రసంగాలు, ఇంటర్వ్యూలు, ఆడియో వీడియో సందేశాలను ప్రచురించడం లేదా ప్రసారం చేయడాన్ని నిషేధిస్తూ, ఈ కట్టుతప్పినవారు కఠినశిక్షలకు అర్హులని బంగ్లాదేశ్ ప్రభుత్వం తన మీడియాను హెచ్చరించింది కూడా.అధికారంకోసం కాక, పతనమైపోతున్న బంగ్లాదేశ్‌ను తిరిగి నిలబెట్టేందుకే తాను స్వదేశానికి వెళ్ళదల్చుకున్నానని హసీనా ఈ సమావేశంలో చెప్పుకొచ్చారు. 2024 జులై--ఆగస్టు మధ్యకాలంలో జరిగిన విద్యార్థి ఉద్యమాన్ని కొందరు ఇతరత్రా లక్ష్యాలతో తప్పుదోవపట్టించి, హింసాత్మకంగా మార్చారని ఆరోపించారామె. తనను అధికారం నుంచి దించేయడానికి జరిగిన ఈ నిరసన వెనుక ఎవరి చేతులున్నాయో, ఏయే శక్తులున్నాయో చెప్పుకొచ్చారామె. ప్రస్తుత పాలకుల చేతిలో బంగ్లాదేశ్ 'నయా పాకిస్థాన్'గా అవతరిస్తోందని, పాకిస్థాన్ ఇంటలిజెన్స్ సంస్థ చక్రం తిప్పుతోందని అంటూ భారత్‌కు ప్రమాదకరంగా పరిస్థితులు తయారవుతున్నాయని ఆమె కుమారుడు సజీద్ వాజేద్ కూడా హెచ్చరిస్తున్నారు.రెండేళ్ళక్రితం హసీనా ఢిల్లీకి తరలివచ్చిన తరువాత బంగ్లాదేశ్‌లో సంభవించిన వరుస పరిణామాలతో ఉభయదేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాత్కాలిక పాలకుడుగా ఉన్న యూనిస్ రహ్మాన్ తనదేశాన్ని చైనా పాకిస్థాన్‌లకు చేరువచేసే పని ఆరంభించారు. బంగ్లాదేశ్ విముక్తిపోరాటాన్ని, పితామహుడు షేక్‌ముజబూర్ రహ్మాన్ చిహ్నాలను చెరిపివేసే ప్రయత్నాలు ఉధృతంగా సాగాయి. బీఎన్పీ అధికారంలోకి వచ్చిన తరువాత పాకిస్థాన్‌తో అంటకాగడం మరింత హెచ్చింది.వయసురీత్యా హసీనా గొంతు వణకవచ్చు, గతాన్ని గుర్తుచేసుకున్న పలు సందర్భాల్లో గద్గదస్వరంగా మారవచ్చు. అధికారకాంక్షతోనే ఆమె ఈ ప్రయాణం కట్టారని బంగ్లా ప్రస్తుత పాలకులు అంటున్నప్పటికీ, చావుకు సిద్ధపడి మరీ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారన్నది నిజం. పొరుగుదేశంలో ఉంటూ కూడా ప్రభావం చూపగలుగుతున్న ఆమె, మళ్ళీ తిరిగివస్తే ఎలా వ్యవహరించాలో, పరిస్థితులు ఏ విధంగా మారతాయో వారికి అర్థంకాకుండా ఉంది. ఆమె తిరిగివచ్చి, జైల్లో ఉన్నా కూడా క్షేత్రస్థాయిలో దాని ప్రభావం విస్తృతంగా ఉంటుందనీ, సమర్థవంతమైన నాయకత్వాన్ని, చివరకు అధికారిక గుర్తింపునూ కోల్పోయిన ఆమె పార్టీకి జవజీవాలు వస్తాయని కొందరివాదన. జైలు నిర్బంధాలు బంగ్లాదేశ్‌కు కొత్త కాదు. ప్రస్తుత ప్రధాని తారీఖ్ రహ్మాన్ తల్లి, మాజీ ప్రధాని ఖలేదాజియా అవినీతి ఆరోపణలతో అనేక సంవత్సరాల పాటు ఢాకా జైల్లో ఉన్నారు. ఇప్పుడు హసీనా కూడా తాను స్వదేశంలో కాలూనగానే, తనను జైల్లో తోయవచ్చు, ప్రాణాలు తీయవచ్చునని అంటూనే, దేనికైనా సిద్ధపడే ఉన్నానని స్పష్టంచేస్తున్నారు. ఆమెను అప్పగించవలసిందిగా భారతదేశాన్ని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయిందని, డిసెంబరులో తాము కోరినదే జరగబోతోందని బంగ్లాదేశ్ నాయకులు అంటున్నారు. తిరిగివస్తానంటున్న హసీనాను కోర్టులో లొంగిపోకముందే అరెస్టు చేస్తామని బంగ్లాదేశ్ న్యాయమంత్రి ఇప్పటికే తేల్చేశారు. మరణశిక్షపడిన ఆమెకు మళ్ళీ కోర్టులను ఆశ్రయించే అవకాశం దక్కనిచ్చేది లేదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారతదేశానికి పలు సవాళ్ళు విసిరే డిసెంబరు పరిణామాలు ఊహకు అందనివి.

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్

**మొదటిపేజీ తరువాయి -** పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.దేశం గర్వించే కళ చేనేత కళ అని, మన రాష్ట్రం ఇలాంటి కళలకు నిలయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మన నేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేశారని గుర్తు చేశారు. "చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి చేసేవారు. చీరాలను ఒకప్పుడు మినీ ముంబయి అనేవారు. అనేక చేనేత ఉత్పత్తులకు గుర్తింపు తీసుకొచ్చారు. 1.27లక్షల మంది ఈ రంగంపైనే ఆధారపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు టీడీపీకే ఓటు వేశారు. సబ్సిడీపై చేనేతలకు విద్యుత్ ఇస్తామన్నాం, మాట నిలబెట్టుకున్నాం.చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తున్నాం. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. చేనేతలకు రూ.25 వేలు ఇస్తున్నాం. అన్ని




వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చాం. ఎన్డీయే ప్రభుత్వం బీసీలకు రుణపడి ఉంది. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటాం. సంజీవని పేరుతో రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేని పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చాం. రెండేళ్లలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు అన్నారు. "సూర్యలంక, బాపట్ల, చీరాలలో బెస్ట్ బీచ్‌లు ఉన్నాయి. శనివారం, ఆదివారం వస్తే హైదరాబాద్ నుంచి ఇక్కడి బీచ్‌లకే వస్తారు. మరో గోవా ఎక్కడో లేదు, చీరాల, సూర్యలంక మధ్యలో ఉంది. చీరాల పక్కన చిన్న ఎయిర్‌పోర్టు కడితే ప్రపంచం అంతా ఇక్కడికే రావాలి. రెండేళ్లలో సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేలు ఖర్చు చేశాం. అభివృద్ధికి రూ.లక్షా 30 వేలు ఖర్చు చేశాం. ఒకప్పుడు పిల్లలంటే భారం, ఇప్పుడు పిల్లలంటే సంపద. రెండేళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. రూ.12 లక్షల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. రూ.12 లక్షల కోట్ల ప్రాజెక్టులు పూర్తయితే 12 లక్షల ఉద్యోగాలు వస్తాయి. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనే నమ్మకాన్ని ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు."

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

**మొదటిపేజీ తరువాయి -**

పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు.ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.

2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి."చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఒక దేశంపై దాడి జరిగితే మూడుదేశాలపై దాడి జరిగినట్టే

**మొదటిపేజీ తరువాయి -**

రక్షణను బలోపేతం చేయడం, సైనిక సహకారాన్ని మరింత లోతుగా విస్తరించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.ఈ ఒప్పందంలో భాగంగా ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, గూఢచార సమాచార మార్పిడి వంటి అంశాలు ఉన్నాయి. అయితే ఇది పూర్తిగా రక్షణాత్మక ఒప్పందమని, ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని టర్కీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ కూటమిలో చేరాలనుకునే ఇతర ప్రాంతీయ భాగస్వాములకు తలుపులు తెరిచే ఉంటాయని, ఈ ఒప్పందం వల్ల టర్కీ నాటో సభ్యత్వం వంటి ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన వివరించారు.మక్కాలో జరిగిన ఈ ఒప్పందంపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతకాలు చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఉమ్రా చేసేందుకు సౌదీ వచ్చిన షరీఫ్, ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కూడా హాజరు కావడం గమనార్హం. దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న చర్చల ఫలితంగా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. 2025 సెప్టెంబర్‌లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన వ్యూహాత్మక ఒప్పందానికి ఇది కొనసాగింపుగా భావిస్తున్నారు. ఈ మూడు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సైనిక సంబంధాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఇరాన్, దాని మిత్రపక్షాలైన హౌతీలు, ఇరాకీ మిలీషియాల నుంచి సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన రవాణాకు ఆటంకాలు, ఇజ్రాయెల్-గాజా-లెబనాన్ ఉద్రిక్తతల నడుమ తమ భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు ఈ దేశాలు ఏకమయ్యాయి. ముఖ్యంగా రక్షణ భాగస్వామ్యం కోసం కేవలం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న సౌదీ అరేబియా దీర్ఘకాలిక వ్యూహంలో ఇది ఒక కీలక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ కూటమిలోని మూడు దేశాలకు ప్రత్యేక బలాలు ఉన్నాయి. సౌదీ అరేబియాకు అపారమైన చమురు సంపద, ఇస్లాం పవిత్ర స్థలాలకు సంరక్షకుడిగా హోదా ఉంది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఏకైక ముస్లిం మెజారిటీ దేశం కాగా, టర్కీ నాటోలో రెండవ అతిపెద్ద సైన్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమను కలిగి ఉంది. మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాలు భద్రతాపరంగా ఏకం కావడం రాజకీయంగా ఒక బలమైన సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు.

## నేత కార్మికులకు అండగా నిలుద్దాం

**మొదటిపేజీ తరువాయి -** కలిగిన చేతులకు గౌరవం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు.చేనేత రంగానికి సాధికారత కల్పించేందుకు జనసేన పార్టీలో ప్రత్యేకంగా 'నేత కార్మికుల అభివృద్ధి విభాగం' ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్ తో పాటు రూ.25,000 ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవలో' పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ.. యువత, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలని, ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పిలుపునిచ్చారు.

## భయపడొద్దు, నేనున్నాను, ప్రధాని మోదీ భరోసా

**మొదటిపేజీ తరువాయి -** ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు."ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## రూ.500తో పాటు చిన్న నోట్లూ ఫేకే!

**మొదటిపేజీ తరువాయి -** నకిలీ నోట్లను భారీగా చలామణిలోకి తెచ్చి, భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనేది వారి ప్రణాళికగా తెలుస్తోంది. 'నకిలీ భారత కరెన్సీ నోట్ల' (ఎఫ్ఐసీఎన్) చలామణిని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్న వేళ, ఈ కొత్త ధోరణి వెలుగులోకి వచ్చింది.భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) విడుదల చేసిన 2025-26 వార్షిక నివేదిక ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో గుర్తించిన మొత్తం దొంగనోట్ల సంఖ్య 5.7 శాతం పెరిగింది. ముఖ్యంగా రూ.20 నకిలీ నోట్ల గుర్తింపు ఏకంగా 47.4 శాతం మేర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు అత్యధికంగా చలామణిలో ఉన్న రూ.500 నకిలీ నోట్లు ఇప్పటికీ అధిక సంఖ్యలోనే పట్టుబడుతున్నాయి. అయితే, రూ.100, రూ.50 నకిలీ నోట్ల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించగా, ఇప్పటికే రద్దయిన రూ.2000 నకిలీ నోట్ల చలామణి గణనీయంగా క్షీణించింది.ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ అప్రమత్తమైంది. నకిలీ నోట్లను గుర్తించే పద్ధతులపై బ్యాంకుల్లో నగదు నిర్వహణ సిబ్బందికి నిర్దేశిత గడువులోగా శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లోని బ్రాంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. నకిలీ నోట్లను గుర్తించి, స్వాధీనం చేసుకోవడంలో విఫలమైతే, నోటు విలువను బట్టి జరిమానాలు ఉంటాయని హెచ్చరించింది. ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన దాడుల్లో పెద్ద, చిన్న విలువ కలిగిన నకిలీ నోట్లు పట్టుబడగా, స్థానిక నెట్‌వర్క్‌ల ద్వారా వీటిని ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు నిఘాను ముమ్మరం చేసినట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

**మొదటిపేజీ తరువాయి -** హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పగలే రాత్రిగా మారే అద్భుతం

**మొదటిపేజీ తరువాయి -** అద్భుత దృశ్యం యూరప్ ప్రధాన భూభాగంపై దశాబ్దాల తర్వాత కనువిందు చేయనుండటం విశేషం. ఈ గ్రహణం సమయంలో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో, నిర్దిష్ట ప్రాంతాల్లో కొద్ది నిమిషాల పాటు పగలే రాత్రిని తలపించేలా వాతావరణం మారిపోతుంది.ఈ సంపూర్ణ సూర్యగ్రహణ మార్గం రష్యాలోని ఉత్తర ప్రాంతంలో ప్రారంభమై, ఆర్కిటిక్, గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్‌లోని పశ్చిమ భాగం మీదుగా ప్రయాణిస్తుంది. అనంతరం స్పెయిన్‌లోని ఉత్తర, తూర్పు ప్రాంతాలు, పోర్చుగల్‌లోని ఈశాన్య భాగంలోకి ప్రవేశిస్తుంది. దీంతో స్పెయిన్‌లోని బిల్బావో, జరగోజా, వాలెన్సియా, పాల్మా డి మల్లోర్కా వంటి నగరాలతో పాటు ఐస్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పగటిపూట పూర్తి చీకట్లు అలుముకుంటాయి. సంపూర్ణ గ్రహణం గరిష్ఠంగా 2 నిమిషాల 18 సెకన్ల పాటు కొనసాగుతుందని అంచనా. స్పెయిన్‌లో సూర్యాస్తమయానికి ముందు సాయంత్రం వేళ ఈ గ్రహణం ఏర్పడుతుండగా, ఐస్‌లాండ్‌లో మాత్రం సూర్యుడు ఆకాశంలో ఎత్తులో ఉన్నప్పుడే కనిపిస్తుంది.సంపూర్ణ గ్రహణ మార్గంలో లేని ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది. యూరప్‌లోని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్కాండినేవియా దేశాలతో పాటు ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాలు, వాయువ్య ఆఫ్రికాలో పాక్షిక గ్రహణాన్ని వీక్షించవచ్చు. ఈ ప్రాంతాల్లో చంద్రుడు సూర్యుడిని పాక్షికంగా కప్పివేస్తాడు. గ్రహణం సమయంలో సూర్యుడి బాహ్య వాతావరణమైన 'కరోనా'పై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే సమయంలో పెర్సీడ్ ఉల్కాపాతం కూడా గరిష్ఠం స్థాయికి చేరనుండటంతో ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతం కానున్నాయి.సూర్యగ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం అత్యంత ప్రమాదకరం. పాక్షిక గ్రహణం సమయంలో తప్పనిసరిగా ఐఎస్ఓ-సర్టిఫైడ్ ఎక్లిప్స్ గ్లాసెస్ లేదా ప్రత్యేక ఫిల్టర్లు ఉపయోగించాలి. కేవలం సంపూర్ణ గ్రహణ మార్గంలో ఉన్నవారు, సూర్యుడు పూర్తిగా కప్పబడిన ఆ కొద్ది నిమిషాలు మాత్రమే ఎలాంటి రక్షణ లేకుండా గ్రహణాన్ని వీక్షించవచ్చని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మిగతా సమయాల్లో నేరుగా చూడటం వల్ల కంటి చూపు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలి



**మొదటిపేజీ తరువాయి -** సాయంత్రం 3:20 నుంచి 3:24 నిమిషాల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం ఈ యాగంలో పాల్గొంటారని దేవాదాయ శాఖ తెలిపింది.రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఎల్ నినో ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ శ్రీశైలం నుంచి నీటి విడుదల కాకపోవడంతో నాగార్జునసాగర్ ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌లోనే ఉంది. శ్రీశైలం నిండటానికి మరో వారం రోజులు పట్టే అవకాశం కనిపిస్తుంది. సాగర్ కింద దాదాపు 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండటంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న వరుణ యాగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది."ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం చేస్తాం. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఈ వరుణ యాగానికి ముహూర్తం ఖరారు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ క్రతువుల నిర్వహణ ఉంటుంది. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో వరుణ యాగం ప్రారంభమవుతుంది. 10న సాయంత్రం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించతలపెట్టాం" - మన్నె సత్యనారాయణ రెడ్డి, యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు

**మొదటిపేజీ తరువాయి -** రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు.ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో




పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన చీరాల పర్యటనలో మానవత్వాన్ని, కళ పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. తనను కలవాలని సోషల్ మీడియాలో కోరిన 90 ఏళ్ల వృద్ధురాలిని ప్రత్యేకంగా పిలిపించుకుని పలకరించడంతో పాటు, మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఆయన పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వివరాల్లోకి వెళితే, చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఫోటో దిగాలన్న తన చిరకాల వాంఛను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. తన చీరాల పర్యటనలో తప్పకుండా కలుస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, పర్యటన సందర్భంగా పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించి ఆప్యాయంగా మాట్లాడారు. ఆమెతో కలిసి ఫోటో దిగి ఆమె కోరికను నెరవేర్చారు. సీఎం తనను గుర్తుపెట్టుకుని పిలిచి మాట్లాడటంతో ఆ వృద్ధురాలు ఆనందంతో అబ్బురపడ్డారు.అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. వారు ఎంతో నైపుణ్యంతో మగ్గంపై వస్త్రం రూపంలో చంద్రబాబు చిత్రపటాన్ని నేశారు. వారి కళా ప్రతిభను చూసి ముగ్ధుడైన ముఖ్యమంత్రి, ఆ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. వారి నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ప్రోత్సాహం అందించారు. సామాన్యుల ఆకాంక్షలకు, కళాకారుల ప్రతిభకు సీఎం ఇస్తున్న విలువకు ఈ



సంఘటనలు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి సీపీఐ



**ప్యాపిలి ఆగస్టు 7 (సీమకిరణం న్యూస్):** ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో కొనసాగుతున్న బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలను వెంటనే అరికట్టాలని కోరుతూ సీపీఐ నాయకులు జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అనిల్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి మహేశ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ గార్లదిన్నె గ్రామంలో కొంతకాలంగా బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, దీంతో యువతతో పాటు గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాల కారణంగా కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు, సామాజిక ఇబ్బందులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జలదుర్గం ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ, సమస్యను పరిశీలించి అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డోన్ పందుల పెంపకందారులకు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక!



**డోన్ టౌన్, ఆగస్టు 07(సీమకిరణం న్యూస్): ::** డోన్ పట్టణంలో పందులను రోడ్లపై స్వేచ్ఛగా వదిలేయవద్దని మున్సిపల్ కమిషనర్ నరేశ్ రెడ్డి పందుల పెంపకందారులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మున్సిపాలిటీ నిబంధనలు ఉల్లంఘించి పందులను రోడ్ల పై విడిచి పెడితే సంబంధిత పెంపుదారులపై జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై సమగ్ర కార్యాచరణ పోలీసు, తహశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. ప్రజారోగ్యం, పరిశుభ్రత కోసం మున్సిపాలిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

# నాటు సారా స్థావరాలపై దాడులు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ శాఖ 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం






**ప్యాపిలి ఆగస్టు 7 (సీమకిరణం న్యూస్):** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్యాపిలి మండలంలోని అలేబాద్ తండా సమీప కొండ ప్రాంతంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 300 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అక్రమ సారా తయారీ, నిల్వ, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ఇటువంటి ప్రత్యేక దాడులు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ మద్యం తయారీ లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని సూచించారు. ఈ దాడుల్లో కర్నూలు ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిని, నంద్యాల ఈఎస్టీఎఫ్ సీఐ లక్ష్మణ్ దాసు, డోన్ సీఐ ఎస్.ఎం.డి. జఫరుల్లా, ఎస్సైలు పి. దౌలత్ ఖాన్, సోమశేఖర్, రమేష్ బాబు, రవితేజతో పాటు సిబ్బంది సుధాకర్ రెడ్డి, శేషన్న, ఉమాకాంత్ రెడ్డి, గోపాల్ సింగ్ పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు.




**డోన్ టౌన్, ఆగస్టు 07,(సీమకిరణం న్యూస్):** డోన్ సమీపన ఏపీ మోడల్ స్కూల్డ జూనియర్ కళాశాలను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీ దానాల రవికాంత్, శ్రీ సి.హెచ్. చుట్ల కాసన్న ఆకస్మికతనికి నిర్వహించారు. ఈ సందర్భంగాకమిటీ సభ్యులు, పాఠశాలలోని మధ్యాహ్నం భోజన పథకం అమలు, తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, బాలికల వసతి గృహం, తాగునీటి సౌకర్యాలు మరియు పరిశుభ్రత, పచ్చదనం, క్రీడా మైదానం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో విద్యాభ్యాసం వసతి, భోజనం విద్యా ప్రమాణాలను గూర్చి చర్చించారు. తదనంతరం విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమగు సూచనలను చేశారు . ప్రిన్సిపల్ కేశిరాజు శ్రీనివాస్ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు, సమస్యలు లేకుండ ఏర్పాటుచేసిన విధానానికి అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో పై - మత్స్యకారులకు అవగాహన...





**వెల్దుర్తి,ఆగస్టు 7 (సీమకిరణం న్యూస్): :** కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలం, గోవర్ధనగిరి గ్రామం లో ఎల్ నినో 2026-27: మంచినీటి మత్స్య రంగంపై ప్రభావం కార్యక్రమం శుక్రవారం నాడు గోవర్ధనగిరి గ్రామం, వెల్దుర్తి మండలం నందు ఎల్లమ్మ గుడి ఆవరణంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి టి.సంధ్యారాణి, జిల్లా ఉప మత్స్య సంచాలకులు (డి.డి), కర్నూలు వారు మరియు టి. చంద్రమోహన్, సహాయ మత్స్య పర్యవేక్షకులు, కర్నూలు వారు హాజరై ఎల్ ని నో మంచినీటి చేపల పెంపకంపై ప్రభావం అనే అంశంపై మత్స్య సహకార సంఘం, గోవర్ధనగిరి మత్స్యకార సభ్యులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఇందులో భాగముగా చెరువులో కాప్టివ్ సీడ్ నర్సరీ చెరువును తవ్వి, దానిలో స్పాన్ (చిరు చేపలు) మూడు నెలలు పెంచి చెరువులో వదులుకోవడం ద్వారా చేప పిల్లల కొనుగోలు, రవాణా ఖర్చు ఆదా చేసుకోవచ్చు అని అదేవిధంగా చెరువులో నీటి స్థాయి తక్కువగా ఉన్నప్పటికీ చెరువు అడుగు భాగంలో పెరిగే కొరమీను, అమూర్ కార్పు, బంగారు తీగ, గడ్డి చేపలు పెంచడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఎఫ్.ఆర్. పి పోర్టబుల్ హ్యాచరీ ద్వారా చిరు చేప పిల్లల ఉత్పత్తి పై అవగాహన కల్పించడం జరిగింది. బ్యాంకుల ద్వారా వలలు, పుట్టీల కొరకు కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు మంజూరు చేయడం, ఎన్ ఎఫ్ డి పి ఆన్లైన్ పోర్టల్ లో ప్రతి మత్స్యకారుడు నమోదు చేసుకోవాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి. శ్రీనివాసులు, గ్రామ మత్స్య సహాయకులు (విఎఫ్ఏ) మరియు గోవర్ధనగిరి మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ యాటగిరి రాజు, రామదాసు వైస్ ప్రెసిడెంట్, వెంకటేశ్వర్లు సెక్రెటరీ, రంగన్న, ఎల్లయ్య లక్ష్మన్న మొదలగు మత్స్యకారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యం

-గౌరవ వేతనాలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్రం సమాధానం



**నెల్లూరు,ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** అంగన్‌వాడీ సేవల పథకం కింద అంగన్‌వాడీ కార్యకర్తలు,అంగన్‌వాడీ ఆయాలు పొందుతున్న గౌరవ వేతనం,రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా చెల్లిస్తున్న గౌరవ వేతనాల వివరాలు,కేంద్ర--రాష్ట్ర వ్యయ భాగస్వామ్య విధానం,పదవీ విరమణ అనంతర సంక్షేమ చర్యలు, బీమా,పెన్షన్,గౌరవ వేతనాల సకాలంలో చెల్లింపు వంటి అంశాలపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో లిఖితపూర్వకంగా ప్రశ్నలు అడిగారు.ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు స్వచ్ఛందంగా సేవలందించే గౌరవ ఉద్యోగులని కేంద్ర మంత్రి తెలిపారు.వీరికి చెల్లించే గౌరవ వేతనాన్ని అవసరానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పెంచుతూ వస్తోందన్నారు.2018 అక్టోబర్ 1 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల కేంద్ర గౌరవ వేతనాన్ని నెలకు రూ.3,000 నుంచి రూ.4,500కు, అంగన్‌వాడీ ఆయాల గౌరవ వేతనాన్ని రూ.1,500 నుంచి రూ.2,250కు పెంచినట్లు వెల్లడించారు.అంతే కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.500, అంగన్‌వాడీ ఆయాలకు రూ.250 చొప్పున పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధులతో కేంద్ర గౌరవ వేతనానికి అదనంగా టాప్-అప్ గౌరవ వేతనాన్ని చెల్లిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.7,000, అంగన్‌వాడీ ఆయాలకు రూ.4,750 చొప్పున అదనపు గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.పెన్షన్, బీమా,ఆరోగ్య రక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రధాన్ మంత్రి శ్రమ్ యోగి మాంధన్ పెన్షన్ పథకంలో చేరేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షల జీవిత బీమా,ప్రధాన్ మంత్రి సురక్షా బీమా యోజన కింద ప్రమాద బీమా సదుపాయాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024--25 ఆర్థిక సంవత్సరం నుంచి ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన కింద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలందరికీ సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 30ను పదవీ విరమణ తేదీగా అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించినట్లు వెల్లడించారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

-ఘనంగా 12వ జాతీయ చేనేత దినోత్సవం

**నెల్లూరు,ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర అన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన భవన్‌లో నిర్వహించిన "నేతన్న సేవలో" కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర,నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.బాపట్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని 4,793 మంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో "నేతన్న సేవలో" పథకం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జమ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2017 ఆగస్టు 7న చెన్నైలో జరిగిన జాతీయ చేనేత సభలో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని,అప్పటి నుంచి రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేనేత కార్మికులతో తమ ప్రభుత్వానికి విడదీయరాని అనుబంధం ఉందని,వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలో చేనేతల సమస్యలను తెలుసుకుని, వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం, ప్రతి నెల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలో ప్రత్యేకంగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చేనేతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తోందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని,రూ.20 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించడం వారికి ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో 4,793 మంది




లబ్ధిదారులకు "నేతన్న సేవలో" పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జమ కావడం సంతోషకరమన్నారు. అలాగే జిల్లాలో 3,225 చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య,చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ రామస్వామి,చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు కె. బాలసుబ్రమణ్యం, వరప్రసాద్,జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన చేనేత సంఘాల నాయకులు,చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ఏపీహెచ్ హెచ్ ఈఎ 10వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుల పిలుపు

-ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అమరావతి ఆధ్వర్యంలో ఘనంగా "స్పోర్ట్స్ మీట్"







**నెల్లూరు , ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అమరావతి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు,కార్యదర్శి జి రామకృష్ణ,దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్,సీనియర్ సిటిజన్ సహాయ సంచాలకులు సంక్షేమ శాఖ నెల్లూరు జిల్లా అధికారి ఏ మహమ్మద్ అయూబ్ పాల్గొని.. ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా ఉద్యోగుల సంఘం సభ్యులతో కలిసి లాంఛనంగా పలు రకాల క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగంలో నిత్యం సతమతమవుతుంటారని.. ఒత్తిడిని దూరం చేసి.. క్రీడలు ఆడటం వల్ల ఎంతో ఆనందంగా,సరదాగా ఇటువంటి స్పోర్ట్స్ మీట్ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ అసోసియేషన్ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి కుమార్ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ స్పోర్ట్స్ మీట్ కి సహాయ సహకారాలు అందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.నేడు 10వ వార్షికోత్సవ వేడుకలను నెల్లూరులో టౌన్ హాల్లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ,ప్రజా ప్రతినిధులు, పలువురు ఉన్నతాధికారులు,వివిధ శాఖల అధికారులు పాల్గొంటున్నారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొని.. ఈ 10వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె కన్నా, ఉపాధ్యక్షులు పిహెచ్ శ్రీరాములు,సత్యనారాయణ,నెల్లూరు జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, మాధవరెడ్డి,గంగాధర్, వైష్ణవి ఉమెన్ సెక్రటరీ, రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు,క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావ నివారణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు



**వెల్దుర్తి' ఆగస్టు 7(సీమకిరణం న్యూస్): :** వెల్దుర్తి మండలములోని కలుగొట్ల గ్రామములో ఎల్ నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక పై రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.కలుగొట్ల మరియు పుల్లగుమ్మి గ్రామాల 11 మంది రైతులకు ఉచితంగా పి ఎం డి ఎస్ కిట్లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పి యమ్ డి యస్) మరియు విత్తన గుళికీకరణ ద్వారా కిట్లు పొందిన రైతుల పొలాల్లో,విత్తనాలు విత్తటం జరిగింది. రైతులు రోజు వారి వాతావరణ సూచనలు మరియు మార్కెట్ ధరలు, వివిధ పంటల యాజమాన్య పద్ధతులు, పంటలపై చీడ పీడలు మరియు వాటి నివారణ, రైతు స్వయంగా పంట నమోదు చేసుకొనే సౌలభ్యం ‷ూాా×మీా ద్వారా చేసుకోవచ్చు. కావున అందరూ రైతులు అందరూ ‷ూాా×మీా ఆప్ డౌన్లోడ్ చేయనుకోవాలని కోరడం జరిగింది.ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పంటల భీమా పథకము క్రింద మొక్కజొన్న, జొన్న, కంది, ఆముదము, కొర్ర సజ్జలు, ఉల్లి మరియు ఎర్ర మిరప పంటలకు నమోదు చేసుకోవడానికి 15-08-2026 తేది వరకు గడువు ఉందని రైతులకు తెలియజేయడం జరిగింది.ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో పశువులకు ఇబ్బంది రాకుండా చెరువుల గట్లపై కూడా పీఎండిఎస్ సాగు పద్ధతిలో పశువులకు పశుగ్రాసం సాగు చేయబోతున్నట్లు తెలిపారు. ఎల్నినో ప్రభావము వల్ల రైతులు నష్టపోకుండా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పి యమ్ డి యస్) సాగు, అంతర పంటల సాగు, మిశ్రమ పంటల సాగు, మరియు చిరుధాన్యాల సాగు వైపు దృష్టి సారించాలని రైతులను కోరారు. వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి ఆర్. అక్బర్ బాషా పశువైద్యాధికారి, పుల్లగుమ్మి, నవీన్ ఎ. పి. సి. యన్. యఫ్ జనార్దన్, పరమేశ్వరుడు మరియు సిబ్బంది ఏఈఓ అజయ్ భార్గవ్, రైతు సేవ కేంద్రం ఇంచార్జ్ అరుణ్, శ్రావణ్, మరియు రైతులు పాల్గొన్నారు.





## ఇంతియాజ్ బాషా మృతి బాధాకరం: మంత్రి టీజీ భరత్



బాధ్యులను వదిలే ప్రసక్తే లేదు

**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** : తెలుగుదేశం పార్టీ నాయకుడు ఇంతియాజ్ బాషాను దారుణంగా హత్య చేయడంపై రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అర్ధరాత్రి జరిగిన ఈ హత్యతో ప్రశాంతంగా ఉన్న కర్నూలు ప్రజలు భయాందోళనకు గురయ్యారని ఆయన పేర్కొన్నారు. ఇంతియాజ్ బాషా హత్యకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. చట్టాన్ని ఎవరైనా తమ చేతుల్లోకి తీసుకుంటే చూస్తూ ఊరుకోబోమని, ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే ఇటువంటి ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

## గుంతల రోడ్డుతో వాహనదారుల అవస్థలు





**నెల్లూరు,ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** నెల్లూరు నగరంలోని కెవిఆర్ పెట్రోల్ బంక్ నుంచి అయ్యప్ప గుడికి వెళ్లే మెయిన్ రోడ్డులో అనేక చోట్ల గుంత లు పడడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి ముఖ్యంగా కెవిఆర్ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న సోహెల్ వాచ్ పాయింట్,ఎన్జీవో హోం,కొండయ్య పాలెం గేట్ సెంటర్,అంబేద్కర్ విగ్రహం దగ్గర మెయిన్ రోడ్లలో గుంతలు ఏర్పడడంతో వర్షాలు వచ్చే సమయంలో, రాత్రి వేళల్లో ఆ గుంతలు కనపడక వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు.ఇటువైపు అధికారులు ప్రయాణం సాగిస్తున్నప్పటికీ.. ఆ గుంతలను చూస్తూ వెళ్ళిపోతున్నారే తప్ప.. గుంతలు మూసే నాధుడు లేడా అంటూ వాహనదారులు విమర్శించుకుంటున్నారు. ఇంకనైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలు లేని రోడ్డుగా తీర్చిదిద్దాలని వాహనదారులు కోరుతున్నారు.

## వేలూరు కళ్యాణ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదానం







**నెల్లూరు, ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని వేదయపాలెం ప్రాంతం దగ్గర స్పిన్నింగ్ మిల్ కాలనీలో వెలసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆడికృత్తిక 44వ మహోత్సవ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించారు.చివరి రోజున సుబ్రహ్మణ్యస్వామి వారికి పూజా కార్యక్రమాలు, హోమము,స్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించి.. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం కెవిఆర్ బ్రదర్స్, సివిల్ కాంట్రాక్టర్ వేలూరు కళ్యాణ్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు1000 మందికి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి దేవస్థానం సభ్యులు మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని వేదయపాలెం ప్రాంతం దగ్గర స్పిన్నింగ్ మిల్ కాలనీలో వెలసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆడికృత్తిక 44వ మహోత్సవ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. మూడో రోజు అన్నదానం ఉభయకర్త వేలూరు కళ్యాణ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. స్వామి వారి 44వ మహోత్సవ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన దాతలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## స్వర్ణ నరసరావు 13వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**నెల్లూరు,ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** స్వర్ణ నరసరావు 13వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు స్వర్ణ రమేష్ బాబు,సురేష్ బాబు ఆధ్వర్యంలో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం కోసం వచ్చే సుమారు 300 రోగులకు శ్రీ సత్య సాయి సేవ ట్రస్ట్ లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా సెప్టెంబర్ 1వ తేదీ నమా అమ్మ గారైన స్వర్ణ జయలక్ష్మి నాల్గవ వర్ధంతి కార్యక్రమం స్థానిక డైకాస్ రోడ్ లో ఉన్న వియ్యాన్ని హోమ్ లో జరుపుతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వారి సోదరి స్వర్ణ పద్మజ,మరదలు భారతి,స్నేహితులు చింతల అమరేంద్ర రెడ్డి, రాఘవేంద్రషెట్టి, పొన్నం రవిచంద్ర,ఆరి ప్రసాద్, ఖలీల్ బేగ్,జయదేవ్, వెంజటేశ్వర రావు, పాల్గొన్నారు

## కర్నూలులో టీడీపీ నాయకుడు దారుణ హత్య

### మాసం భాష దర్గా వద్ద ఇంతియాజ్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి




**కర్నూలు క్రైమ్, ఆగస్టు 07, (సీమకిరణం న్యూస్):** : కర్నూలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసం భాష దర్గా వద్ద టీడీపీ నాయకుడు ఇంతియాజ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనతో వన్‌టౌన్ పరిధిలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హత్యకు వ్యక్తిగత కారణాలా? లేక గతంలో ఉన్న కక్షలే కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. ఇంతియాజ్ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నూలు నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం టీడీపీ నాయకుడిగా కొనసాగుతున్న ఆయన హత్యకు గురికావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని, హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై ఆరా తీస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వన్‌టౌన్ పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### వినియోగదారులు, చిన్న వ్యాపారులకుఊరట.. యూపీఐపై ఛార్జీలుండవ్!

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై ఛార్జీలు విధించవచ్చనే చర్చలకు పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) శుక్రవారం తెరదించింది. వినియోగదారులకు యూపీఐ చెల్లింపులు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని, చిన్న వ్యాపారుల నుంచి ఎటువంటి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేయబోమని శుక్రవారం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.2016లో ప్రారంభమైనప్పటి నుంచి యూపీఐ సేవలు వినియోగదారులకు ఉచితంగానే అందుబాటులో ఉన్నాయని, భవిష్యత్తులోనూ లావాదేవీలపై ఛార్జీలు విధించే ప్రతిపాదన ఏదీ లేదని పీసీఐ తన పోస్టులో పేర్కొంది. భారతీయులందరూ ఎటువంటి అదనపు రుసుములు లేకుండా తక్షణ డిజిటల్ చెల్లింపులు కొనసాగించవచ్చని భరోసా ఇచ్చింది. అదేవిధంగా, చిన్న వ్యాపారులు సైతం యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించేందుకు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది.

# 7.2 కాదు.. 6.6 శాతమే!



### జీడీపీ వృద్ధి అంచనాలకు ఆర్బీఐ కోత
### దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు
### ద్రవ్యోల్బణం 4.8 శాతానికి పెరగొచ్చు
### తాజా ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్
### కీలక వడ్డీరేట్లు ఈసారీ యథాతథం
### సీఆర్ఆర్ అర శాతం తగ్గింపు

దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా ద్రవ్యసమీక్షలో ప్రస్ఫుటంగా కనిపించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఆర్బీఐ తగ్గించిన జీడీపీ వృద్ధిరేటు అంచనాలే ఇందుకు నిదర్శనం. ఈసారి 6.6 శాతానికే వృద్ధిరేటు పరిమితం కావచ్చని ఆర్బీఐ పేర్కొన్నది మరి. గతంలో 7.2 శాతంగా ఈ అంచనా ఉండటం గమనార్హం. ఇప్పటికే ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో దేశ జీడీపీ అధికారిక గణాంకాలు 7 త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే నమోదైన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కూడా ఒకింత ఆందోళన వెలిబుచ్చిన సంగతి విదితమే. కాగా, అకాల వర్షాలు ఆగిపోతే, కేంద్ర ప్రభుత్వం మౌలిక రంగాభివృద్ధికి పెట్టుబడులను పెడుతూపోతే వృద్ధిరేటు తిరిగి పుంజుకోవచ్చన్న ఆశాభావాన్ని శుక్రవారం ద్రవ్యసమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆయా రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని, ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత ఎగదోయవచ్చన్న ఆందోళననూ కనబర్చారు. ఇదిలావుంటే ఊహించినట్టుగానే తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలోనూ రెపో రేటు జోలికి ఆర్బీఐ వెళ్లలేదు. ఆరుగురు సభ్యుల ద్రవ్యవిధాన కమిటీలో నలుగురు కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచేందుకు మొగ్గుచూపారు.

#### ధరలు తగ్గవ్

ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవని ఆర్బీఐ తేల్చేసింది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను పావు శాతానికిపైగా పెంచేసింది. 4.8 శాతంగా ప్రకటించింది. మునుపు ఇది 4.5 శాతంగానే ఉండటం గమనార్హం. ఇక ఆహారోత్పత్తుల ధరలు అదుపులోకి రావడం లేదని, దీంతో ఈ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలోనూ రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగేందుకే అవకాశాలున్నాయని ఆర్బీఐ గవర్నర్ దాస్ చెప్తున్నారు. 5.7 శాతంగా నమోదు కావచ్చన్నారు. అయితే జనవరి-మార్చిలో 4.5 శాతానికి దిగిరావచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.2 శాతానికి చేరిన సంగతి విదితమే. గత ఏడాది సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయికి వెళ్లడం ఇదే తొలిసారి. కూరగాయలు, వంటనూనెలు, పప్పుధాన్యాల రేట్లకు రెక్కలు తొడగడమే ఇందుకు కారణం.

#### మ్యూల్‌హంటర్.ఏఐ

ఆర్థిక మోసాలకు తావిస్తున్న మ్యూల్ అకౌంట్లకు అడ్డుకట్ట వేసేందుకు 'మ్యూల్‌హంటర్.ఏఐ'కి శ్రీకారం చుట్టామని, ఇందులో భాగస్వామ్యం కావాలని బ్యాంకులను ఆర్బీఐ కోరింది. డబ్బును ఎరగా చూపి అమాయకుల చేత బ్యాంకుల్లో నేరగాళ్లు తెరిపించే ఖాతాలనే మ్యూల్ అకౌంట్స్ అంటారు. అయితే క్రిమినల్స్ తమ అక్రమార్జనను ఈ ఖాతాల్లో భద్రపర్చుకొని తప్పించుకు తిరుగుతుండటాన్ని ఆర్బీఐ గుర్తించింది. ఈ ఖాతాలను కనిపెట్టి చెక్ పెట్టడంపై దృష్టి పెట్టిన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్.. మ్యూల్‌హంటర్.ఏఐని అభివృద్ధిపర్చింది. రెండు భారీ ప్రభుత్వ రంగ బ్యాంకులతో కలిసి చేపట్టిన మ్యూల్‌హంటర్.ఏఐ పైలట్ ప్రాజెక్ట్‌లో ఉత్సాహవంతమైన ఫలితాలు వచ్చాయనీ దాస్ చెప్పారు. కాబట్టి బ్యాంకులన్నీ సహకరిస్తే ఈ అక్రమ కార్యకలాపాలకు ఇట్టే చెక్ పెట్టవచ్చన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సైతం మ్యూల్‌హంటర్.ఏఐని వినియోగిం చుకోవాలని బ్యాంకులకు సూచించింది.

#### 4 శాతానికి సీఆర్ఆర్ తగ్గింపు

ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల నడుమ కీలక వడ్డీరేట్ల తగ్గింపుల జోలికి వెళ్లలేకపోతున్న ఆర్బీఐ.. ఆర్థిక మందగమనం సంకేతాల మధ్య ఈసారి ద్రవ్యసమీక్షలో నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని తగ్గించింది. తద్వారా మార్కెట్‌లో రుణ లభ్యతను పెంచింది. అర శాతం కోత పెడుతూ 4.5 శాతం నుంచి 4 శాతానికి సీఆర్ఆర్‌ను పరిమితం చేసింది. ఈ నిర్ణయం రెండు విడుతల్లో అమల్లోకి రానుండగా, డిసెంబర్ 14, 28 తేదీల్లో బ్యాంకులకు సీఆర్ఆర్ మిగులు నిధులు అందుబాటులోకి వస్తాయని ఆర్బీఐ గవర్నర్ దాస్ స్పష్టం చేశారు. దీంతో బ్యాంకుల్లోకి అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నగదు నిల్వలు రానున్నాయి. 2022 మే 4న సీఆర్ఆర్‌ను 4 శాతం నుంచి 4.5 శాతానికి ఆర్బీఐ పెంచింది. మే 21 నుంచే ఆ నిర్ణయం అమల్లోకి వచ్చింది. అప్పట్నుంచి అది అలాగే ఉన్నది. కాగా, వాణిజ్య బ్యాంకులు తాము కస్టమర్ల నుంచి సేకరించిన డిపాజిట్లలో కొంతమేర బ్యాంక్ వాల్ట్స్‌ల్లో లేదా ఆర్బీఐ వద్ద పెట్టాల్సి ఉంటుంది. ఆ మొత్తాలకు సంబంధించిన నిష్పత్తే సీఆర్ఆర్. ఇప్పుడు బ్యాంకులు తమ డిపాజిట్లలో 4 శాతం పక్కకు పెట్టాల్సి ఉంటుంది. వీటిపైన బ్యాంకులకు ఎలాంటి ఆదాయం ఉండదు. ఖాతాదారుల ప్రయోజనార్థం ఆర్బీఐ సీఆర్ఆర్‌ను అమలుపరుస్తూ ఉంటుంది. కీలక వడ్డీరేట్లు యథాతథం. వరుసగా 11వ ద్రవ్యసమీక్షలోనూ 6.5 శాతం వద్దే రెపో రేటు. ప్రవాసుల విదేశీ కరెన్సీ డిపాజిట్లను ఆకర్షించేందుకు ఆర్బీఐ వాటిపై వడ్డీరేట్లను పెంచింది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనమవుతున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. వివిధ కాలపరిమితి డిపాజిట్లపై తక్షణమే పెరిగిన వడ్డీరేట్లు అమల్లోకి వచ్చాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ప్రీ-సాంక్షన్డ్ రుణాలకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ అనుమతిచ్చింది. దీంతో రుణాల లభ్యత మరింత సులభతరమైనట్టైంది. కాగా, త్వరలోనే ఈ నిర్ణయానికి సంబంధించిన మార్గదర్శకాలను రిజర్వ్ బ్యాంక్ విడుదల చేయనున్నది. డాలర్ ముందు రూపీ వెలవెలబోతున్న తరుణంలో విదేశీ వాణిజ్య లావాదేవీల్లో డాలర్ చలామణిని తగ్గించేలా ఏ చర్యల్నీ తీసుకోవడం లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయితే డాలర్ పెరుగుదల ప్రభావం వాణిజ్యంపై పడకుండా ఇతర మార్గాల్లో ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నది. కొన్ని దేశాలతో స్థానిక కరెన్సీల్లోనే పరస్పర వాణిజ్య లావాదేవీలకు ఆర్బీఐ కృషి చేస్తున్నది తెలిసిందే.

#### తదుపరి ద్రవ్యసమీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 5-7 తేదీల్లో.

ధరల గుర్రానికి కళ్లెం వేయాలి: దాస్ వరుసగా 11వ ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచిన నేపథ్యంలో వృద్ధిరేటుకు ఊతమిచ్చేలా ఇకనైనా వడ్డీరేట్లను తగ్గించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం కట్టడే తమ లక్ష్యమని, ధరల గుర్రానికి కళ్లెం వేయడంపైనే ప్రధానంగా దృష్టి పెడుతాంటూ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ఇక ఈ జూలై-సెప్టెంబర్‌లో దేశ జీడీపీ 5.4 శాతానికి పడిపోవడం, అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతాన్ని దాటేయడంతో వృద్ధిరేటును పెంచేందుకు, ద్రవ్యోల్బణాన్ని దించేందుకు అవసరమైన అన్ని సాధనాలనూ ఉపయోగిస్తున్నామని దాస్ చెప్పారు.

#### మీకు నేను హెడ్‌లైన్ కాను

పదవీకాలం పొడిగింపుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు 'ఈ విషయంలో నేను మీకు ఏ హెడ్‌లైన్ ఇవ్వను' అంటూ దాస్ సమాధానాన్ని తోసిపుచ్చారు. ఈ నెల 10తో ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ పదవీకాలం ముగియనున్నది. ఇప్పటికే దాస్ టెన్యూర్‌ను కేంద్ర ప్రభుత్వం మూడేండ్లు పెంచిన విషయం తెలిసిందే. 2021లో పదవీకాలం నెల రోజుల్లో ముగుస్తుందనగా పొడిగించారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ రాజీనామాతో దాస్ వచ్చిన సంగతి విదితమే. ఇక ఆర్బీఐ చరిత్రలో అత్యధిక కాలం గవర్నర్‌గా పనిచేసినవారి జాబితాలో బెనగల్ రామారావు తర్వాత దాస్‌దే స్థానం. ఆర్బీఐ తదుపరి గవర్నర్ ఎవరన్నది ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో కూడిన కమిటీ నిర్ణయిస్తుంది.

#### ఎవరేమన్నారు?

ఈసారి ద్రవ్యసమీక్షలో దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు కలిసొచ్చే నిర్ణయాలనే ఆర్బీఐ ప్రకటించింది. సీఆర్ఆర్ తగ్గింపు, విదేశీ కరెన్సీ డిపాజిట్లపై వడ్డీరేట్ల పెంపు, పూచీకత్తులేని వ్యవసాయ రుణాల పరిమితిని పెంచడం బాగుంది.

# మార్కెట్లోకి హోండా థర్డ్ జనరేషన్ అమేజ్ రూ.7.99 లక్షల నుంచి ప్రారంభం




ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా ఇండియా తన థర్డ్ జనరేషన్ సబ్ కంపాక్ట్ అమేజ్ కారు దేశీయ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.7.99 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమై రూ.10.89 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది. ఇవీ ఇంట్రడ్యూసరీ ధరలు అని, 45 రోజుల వరకూ బుకింగ్ చేసుకునే వారికి ఈ ధరలు వర్తిస్తాయి. వీ, వీఎక్స్, జడ్ఎక్స్ వేరియంట్లలో న్యూ అమేజ్ లభిస్తుంది. న్యూ మారుతి సుజుకి డిజైర్, హ్యుండాయ్ ఔరా, టాటా టైగోర్ వంటి పాపులర్ కంపాక్ట్ సెడాన్‌లతో పోటీ పడుతుంది. సెకండ్ లెవల్ అడాస్ షూట్ తో వస్తున్న హోండా అమేజ్ అత్యంత పాపులర్ కారు. కొల్లిషన్ మిటిగేషన్ బ్రేకింగ్, ఆటో హై బీం, అడ్వాన్స్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీపింగ్ అసిస్ట్, రోడ్ డిపార్చర్ మిటిగేషన్ తదితర ఫీచర్లు ఉన్నాయి. ఆసక్తి గల కస్టమర్లు ఆన్‌లైన్‌లో గానీ, సమీప డీలర్ల వద్ద గానీ బుక్ చేసుకోవచ్చు. 2025 జనవరి నుంచి డెలివరీలు ప్రారంభిస్తారు. హోండా న్యూ అమేజ్ కారు 1.2 లీటర్ల, ఫోర్ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ తదితర ఫీచర్లు ఉంటాయి. హోండా లేన్ వాచ్ కెమెరా ఉంటుంది. ఇది బ్లైండ్ స్పాట్ మానిటర్ మాదిరిగా పని చేస్తుంది.

#### హోండా అమేజ్ వీ వేరియంట్ ఇలా

హోండా అమేజ్ వీ వేరియంట్ ఎంట్రీ లెవెల్ కారు. పవర్ అడ్జస్టబుల్, బాడీ కలర్డ్ ఓఆర్వీఎంస్ విత్ ఎల్ఈడీ టర్న్ ఇండికేటర్స్, 8-అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ విత్ వైర్ లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే, సెమీ డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, 7- అంగుళాల ఎంఐడీ ఉంటాయి. వాయిస్ కమాండ్స్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్, మాన్యువల్ ఎయిర్ కండిషనింగ్, స్టీరింగ్ మౌంటెడ్ కంట్రోల్స్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్, టిల్ట్ స్టీరింగ్ అడ్జస్ట్, 14 అంగుళాల స్టీల్ వీల్స్ విత్ కవర్స్, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్ లైట్స్ విత్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఎల్ఈడీ టెయిల్ లైట్స్, షార్క్ ఫిన్ యాంటినా ఉంటాయి. హోండా అమేజ్ వీ వేరియంట్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ రూ.8 లక్షలు (ఎక్స్ షోరూమ్), సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ రూ.9.20 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. ఫ్యాబ్రిక్ అప్ హోల్‌స్టరీ, రేర్ ఆర్మ్ రెస్ట్ విత్ కప్ హోల్డర్స్, పెడల్ షిఫ్టర్స్ (సీవీటీ), కీ లెస్ ఎంట్రీ, ఎలక్ట్రికల్ ట్రంక్ లాక్ విత్ కీలెస్ రిలీజ్, ఆల్ ఫోర్ పవర్ విండోస్, 6 ఎయిర్ బ్యాగ్స్, ఏబీఎస్ విత్ ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్సీ), ట్రాక్షన్ కంట్రోల్, డే / నైట్ ఇన్ సైడ్ రేర్ వ్యూ మిర్రర్, 3- పాయింట్ సీట్ బెల్ట్స్, హెడ్ రీస్ట్రైంట్స్ ఫర్ ఆల్ సీట్స్, హిల్ స్టార్ట్ అసిస్ట్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్, రేర్ పార్కింగ్ సెన్సర్లు అండ్ కెమెరాలు ఉంటాయి.

#### హోండా అమేజ్ వీఎక్స్ ఇలా

హోండా అమేజ్ మిడ్ స్పెషిఫికేసన్ వీఎక్స్ ట్రిమ్ కారు మాన్యువల్ ట్రాన్స్ మిషన్ వేరియంట్ రూ.9.10 లక్షలు (ఎక్స్ షోరూమ్), సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ వేరియంట్ రూ.10 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. అదనంగా ఎల్ఈడీ ప్రొజెక్టర్ ఫాగ్ లాంప్స్, 15-అంగుళాల అల్లాయ్ వీల్స్, పవర్ ఫోల్డింగ్ వింగ్ మిర్రర్స్ తోపాటు సాటిన్ మెటాలిక్ గార్నిష్ ఆన్ డాష్ బోర్డ్, పుష్ స్టార్ట్ అండ్ స్టాప్ బటన్, ఆటో హెడ్ ల్యాంప్స్, వైపర్స్, రేర్ డీఫాగర్, రిమోట్ ఇంజిన్ స్టార్ట్ (సీవీటీ), ఆటో క్లైమేట్ కంట్రోల్ విత్ మ్యాక్స్ కూల్ మోడ్, రేర్ ఏసీ వెంట్స్, వైర్ లెస్ చార్జర్, కనెక్టెడ్ కార్ టెక్ విత్ అలెక్సా కంపాటిబిలిటీ, టూ అడిషనల్ ట్వీటర్లు, రేర్ వ్యూ కెమెరా, లేన్ వాచ్ కెమెరా ఉంటాయి.

#### రూ.9.70 లక్షల నుంచి అమేజ్ జడ్ఎక్స్

టాప్ స్పెక్ జడ్ఎక్స్ ట్రిమ్ కారు డ్యుయల్ టోన్ 15-అంగుళాల వీల్స్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి హోండా సెన్స్ అడాస్ ఫీచర్లు, ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్, లేన్ కీపింగ్ అసిస్ట్, ఆటో హై బీం తదితర ఫీచర్లు ఉంటాయి. రేడియంట్ రెడ్ మెటాలిక్, ఒబ్సిడియాన్ బ్లూ పెరల్, గోల్డెన్ బ్రౌన్ మెటాలిక్, మీటరాయిడ్ గ్రే మెటాలిక్, లూనార్ సిల్వర్ మెటాలిక్, ప్లాటినం వైట్ పెరల్ రంగుల్లో అమేజ్ కారు లభిస్తుంది. 1.2 లీటర్ల 4-సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ విత్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ వేరియంట్లలో లభిస్తుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 90 హెచ్పీ విద్యుత్ %-% 110 ఎన్ఎం టార్చ్ వెలువరిస్తుంది. సీవీటీ మోడల్ కారు లీటర్ పెట్రోల్ పై 19.46 కి.మీ, 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ ఆప్షన్ 18.65 కి.మీ మైలేజీ ఇస్తుంది. మూడేండ్ల స్టాండర్డ్ వారంటీతోపాటు దాన్ని అపరిమిత దూరంతోపాటు ఏడేండ్ల వరకూ పొడిగించుకునే అవకాశం ఉంటుంది. అప్ రైట్ గ్రిల్లె, ట్విన్ పాడ్ ప్రొజెక్టర్ హెడ్ లైట్స్, సింపుల్ అండ్ నీట్ బంపర్ డిజైన్ విత్ ప్రొజెక్టర్ ఫాగ్ ల్యాంప్స్ తదితర ఫీచర్లు ఉంటాయి.

## కొత్త కలర్ ఆప్షన్‌లో మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా మోటరోలా ఎడ్జ్ 50 నియో



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ మోటరోలా తన మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్లు కొత్త కలర్ ఆప్షన్ లో తీసుకొస్తున్నది. పాంటోన్ కలర్ మొచ్చా మౌజ్ రంగులో వచ్చే ఏడాది వస్తాయని తెలిపింది. మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ 6.9 అంగుళాల ఫుల్ హెచ్డీం ఎల్టీపీఓ పోలెడ్ మెయిన్ డిస్ ప్లే, 4-అంగుళాల కవర్ స్క్రీన్, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్ 6.4 అంగుళాల ఫ్లాట్ ఎల్టీపీఓ పోలెడ్ డిస్ ప్లే కలిగి ఉంటాయి. మొచ్చా మౌజ్ కలర్ ఆప్షన్ లో వస్తున్న మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్లు సెలెక్టెడ్ గ్లోబల్ మార్కెట్లలో మాత్రమే లభిస్తాయి. భారత్ మార్కెట్లో లభిస్తుందా? లేదా? అన్న సంగతి వెల్లడి కాలేదు. మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ మిడ్ నైట్ బ్లూ, స్ప్రింగ్ గ్రీన్, పీచ్ ఫజ్ కలర్ ఆప్షన్లు, మోటరోలా ఎడ్జ్ 50 నియో ఫోన్ నాటికల్ బ్లూ, పయోంకియా, లాట్టే, గ్రిసైల్లె షేడ్స్ లో ఆవిష్కరించారు. మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ 12 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.99,999లకు లభిస్తుంది. 6.9 అంగుళాల ఫుల్ హెచ్డీం మెయిన్ స్క్రీన్, 4 అంగుళాల ఔటర్ డిస్ ప్లే కలిగి ఉంటుంది. క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ ఎస్వోసీ, 45 వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 4000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ ఉంటుంది. డ్యుయల్ 50-మెగా పిక్సెల్ రేర్ కెమెరాలు, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32-మెగా పిక్సెల్ కెమెరా ఉంటాయి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com . RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com